

మూడు జిల్లాలను ముంచెత్తిన వాన

రాష్ట్రంలో ప్రారంభమైన ఈశాన్యం



తిరుచెందూర్ ఆలయంలో వరద ఉధృతి

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ఆగమనంతో రాష్ట్రంలో వాతావరణం మరింత చల్లబడింది. తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి జిల్లాలను వర్షం ముంచెత్తింది. ఈ జిల్లాల్లో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో గురువారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తిరునల్వేలి జిల్లాలో పాళయంకోట, తిరునల్వేలి, చేరన్మాదేవి, మణిముత్తారు, నాంగునేరి ప్రాంతాల్లో చేరిన వరదనీటి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మణిముత్తారు జలపాతంలో వరదప్రవాహం పెరగడంతో స్నానాలు నిషేధించడంతో పర్యాటకులు నిరాశగా వెనుతిరిగారు. తూత్తుకుడి జిల్లాలోని కోస్తా ప్రాంతాలైన తిరుచెందూర్, కాయల్‌పట్టి, కులశేఖరపట్టణం, ఉడన్‌కుళి తదితర ప్రాంతాల్లో గత రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు సుమారు 38 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వరదనీరు చేరింది. తెన్‌కాశి జిల్లా తామరపరిణి వాగు తీరంలో నివసిస్తున్న ప్రజలకు వరద హెచ్చరికలు చేశారు.. ఈ జిల్లాలో గరిష్ఠంగా కాయల్‌పట్టణంలో 154 మిల్లీలీటర్ల వర్షపాత నమోదైంది. అదేవిధంగా ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కన్నియాకుమారిలో వర్షాలకు జనజీవనం స్తంభించింది. రబ్బరు తోట కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఈశాన్యంతో వర్షాలు... : తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో గురువారం ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైనట్లు దక్షిణ భారత వాతావరణ పరిశోధన కేంద్రం డీడీజీఎం డాక్టర్ బి.అముద పేర్కొన్నారు. గురువారం ఆమె చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈసారి ఈశాన్య రుతుపవనాల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో గరిష్ఠంగా కాయల్‌పట్టినం, తిరుచెందూర్‌లో 15సెంటిమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని తెలిపారు. ఈ నెల 1 నుండి గురువారం వరకు 10 సెంటిమీటర్ల వర్షం కురిసిందని, ఇది గతంలో కంటే 37శాతం అధికమన్నారు. కన్నియాకుమారి సమీపంలో ఏర్పడిన అల్పపీడనం క్రమక్రమంగా బలపడి 18వ తేదీన కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వాయుగుండంగా పయనించే అవకాశముందన్నారు.24వ తేదీ దక్షిణ తూర్పు బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్ప డే అవకాశముందని, ఇది పశ్చిమ, ఉత్తర దిశగా పయనించి బలపడే అవకాశముందన్నారు. ఈశాన్యం రోజుల్లో సముద్రంలో పలు తుఫాన్లు ఏర్పడే అవకాశముందన్నారు. రానున్న వారం రోజుల్లో తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి, విరుదునగర్, తూత్తుకుడి, రామనాథపురం సహా కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఇందువల్ల ఈ ప్రాంతాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 30నుండి 40కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, రానున్న ఐదు రోజులు జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని ఆమె హెచ్చరించారు. చెన్నై నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అముద తెలిపారు.

అన్బుమణిలో

నాయకత్వ లక్షణాల్లేవు

- పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు అన్బుమణిలో నాయకత్వ లక్షణాలు ఆవగింజంతైనా లేవని పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ పేర్కొన్నారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను అనారోగ్యానికి గురై ఈ నెల 5వ తేదీ అపోలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలు రాజకీయ పార్టీల నాయకులు వచ్చి పరామర్శించారని, అయితే కొత్తగా పార్టీ స్థాపించిన నాయకుడు మాత్రం రాలేదన్నారు. మరికొంతమంది ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగితెలుసుకున్నారని, ఇది సంతోషం కలిగించిందన్నారు. తాను ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో ఉన్నందువల్ల చూడలేకపోయినట్లు అన్బుమణి మీడియాకు తప్పుడు సమాచారం ఇచ్చారని, అసలు తాను ఎమర్జెన్సీ, ఐసీయూ విభాగాలకే వెళ్లలేదన్నారు. అన్బుమణిలో రాజకీయ లక్షణాలు లేవని, ఆయన పార్టీలో కీలకపదవులతో పాటు ఎంపీగా వ్యవహరించారని, ప్రస్తుతం పీఎంకేకు, అన్బుమణికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయన కొత్త పార్టీ పెడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు రారని, పదవుల కోసం కొంతమంది ఎగబడతారని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 30న నిర్వహించనున్న పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో 2026 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పొత్తులపై నిర్ణయం తీసుకోనున్నట్లు రాందాస్ పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పీఎంకే నేత రాందాస్



శాసనసభలో సిద్ధవైద్య విశ్వవిద్యాలయం ముసాయిదా బిల్లుపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సిద్ధ వైద్య వర్సిటీ బిల్లుపై ఎలా మాట్లాడతారు ?

- గవర్నర్ వాఖ్యలపై శాసనసభలో సీఎం స్టాలిన్ ఆగ్రహం

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సిద్ధ వైద్య విశ్వవిద్యాలయానికి సంబంధించి ముసాయిదా చట్టాన్ని శాసనసభలో ఆమోదించడానికి ముందు, ఆ ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలు తెలిపే హక్కు గవర్నర్‌కు లేదని, ఈ బిల్లుపై గవర్నర్ రాజ్యాంగానికి విరుద్ధమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి స్టాలిన్ శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం ఈ ముసాయిదా బిల్లుపై గవర్నర్ చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తూ స్టాలిన్ ప్రసంగించారు. రాష్ట్ర సిద్ధ వైద్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లు ఆర్థిక చట్టపరిధిలోకి వస్తున్నందున దీనిపై శాసనసభలో పరిశీలించేందుకు గవర్నర్ సిఫారసు లేదా ప్రతిపాదన మాత్రమే చేయాల్సి ఉంటుందని, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని శాసనసభ ద్వారా ఆ బిల్లును రూపొందించి, న్యాయశాఖ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే ఈ ముసాయిదా బిల్లును గవర్నర్‌కు పంపామని తెలిపారు. అయితే గవర్నర్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకుండా, ముసాయిదా బిల్లులోని అంశాలపై తన అభిప్రాయాలను చొప్పించారని, తాను వ్యక్తపరచిన వివరాలను తగిన విధంగా ఎమ్మెల్యేల దృష్టికి తీసుకురావాలని ఓ సందేశం పంపారని తెలిపారు. ఆ సందేశం రాజ్యాంగానికి, శాసనసభ నియమాలకు విరుద్ధంగా ఉందని స్టాలిన్ పేర్కొన్నారు. శాసనసభలో ఒక బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు లేదా శాసనసభ పరిశీలనలో ఉన్న బిల్లుపై ఎన్నికైన ఎమ్మెల్యేలకు మాత్రమే దానికి సవరణ ప్రతిపాదించే అధికారం ఉందని, బిల్లును ఆమోదించేందుకు ఓటింగ్ కోరే అధికారం కూడా సభ్యులకే ఉంది తప్ప బిల్లుపై వ్యాఖ్యానించే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టం చేశారు. గవర్నర్ అభిప్రాయాలను శాసనసభ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్టాలిన్ తేల్చి చెప్పారు. ఈ ముసాయిదా బిల్లుపై గవర్నర్ "పరిశీలించండి, పరిగణనలోకి తీసుకోండి" అనే ఆంగ్ల పదాలను వాడటానికి బదులుగా "తగిన విధంగా పరిశీలించండి" అంటూ పేర్కొనడం, సభ రూపొందించిన బిల్లు తగిన విధంగా లేదనే భావాన్ని కలిగిస్తుందని స్టాలిన్ వివరించారు. గవర్నర్ అభిప్రాయాలు శాసనసభ మర్యాదను కించపరిచేలా ఉండటంతో ఆ అభిప్రాయాలను తోసిపుచ్చుతున్నామని, గవర్నర్ పంపిన సందేశంలో వివరాలు సైతం సభ రికార్డుల్లో ఉండకూడదని ప్రతిసభ్యుడూ భావిస్తాడని, కనుకనే తాను ఆ వ్యాఖ్యలను సభ రికార్డుల్లో నమోదు చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. గవర్నర్ సందేశంలో శాసనసభ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఉన్న వ్యాఖ్యలను సభ ఏకగ్రీవంగా నిరాకరిస్తుందన్నారు. ఈ మేరకు తాను ప్రతిపాదిస్తున్న తీర్మానాన్ని సభ్యులందరూ ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు స్టాలిన్ చేసి తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదించిందని స్పీకర్ అప్పావు ప్రకటించారు.

అర్హులైన గృహిణులకు

డిసెంబర్ 15 నుంచి రూ.1000

- డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడతగా అర్హులైన గృహిణులకు కలైంజర్ మహిళా సాధికార పథకం కింద ప్రతినెలా రూ.1000 చెల్లించనున్నట్లు ప్రత్యేక పథకాల అమలు మంత్రిత్వ శాఖను నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రకటించారు. గురువారం ఉదయం శాసనసభలో ఆయన మాట్లాడుతూ... 2023 సెప్టెంబర్ 15న ప్రారంభమైన ఈ పథకానికి అపూర్వ స్పందన లభించిందని, గృహిణుల్లో ఆర్థిక పొదుపు పెరిగిందని, ఆ నగదును అత్యవసరాలకు, వైద్య చికిత్సలకు ఉపయోగిస్తున్నట్లు ప్రభుత్వ అధికారులు జరిపిన సర్వేలలో వెల్లడైందని తెలిపారు. రాష్ట్రమంతటా 1.14 లక్షల మంది గృహిణులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, ప్రభుత్వం రూ.30వేల కోట్లను ఈ పథకానికి వ్యయం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ పథకానికి విధించిన కొన్ని నిబంధనలను ముఖ్యమంత్రి స్టాలిన్ సడలించారని, ఆ మేరకు కొత్తగా 28లక్షల మంది గృహిణులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో అర్హులైన వారిని నవంబర్ 30లోగా ఎంపిక చేసి, డిసెంబర్ 15 నుండి రెండో విడతగా అర్హులైన గృహిణులందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.



5న కరూర్‌కు

రాహుల్‌గాంధీ



ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నవంబర్ 5వ తేదీ కరూర్‌కు రానున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రకటించింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్ గత నెల 27న కరూర్ పర్యటించిన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందడం దేశవ్యాప్తంగా కలకలంరేపిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలను ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి సహా పలువురు పరామర్శించి ఓదార్చారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బీజేపీకి చెందిన సీనియర్ నటి హేమమాలినిలతో పాటు ఎన్డీఏ ఎంపీల బృందం కరూర్‌లో ఘటనా స్థలాన్ని పరిశీలించింది. ఇన్నాళ్లూ అమెరికా పర్యటనకు వెళ్లిన రాహుల్ గాంధీ ప్రస్తుతం తిరిగొచ్చారు. ఆయన నవంబర్ 5వ తేదీన కరూర్‌కు వస్తారని, బాధితులను పరామర్శిస్తారని టీఎన్‌సీసీ నేతలు తెలిపారు.

'కిడ్నీలు జాగ్రత్త!' బ్యాడ్జీలతో అసెంబ్లీకి అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనకు డీఎంకే ప్రభుత్వం సరైన భద్రతా ఏర్పాట్లు చేపట్టకపోవడమే కారణమని ఆరోపిస్తూ బుధవారం చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరైన అన్నాడీఎంకే సభ్యులు గురువారం మరో రకం బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. నామక్కల్‌లో జరిగిన కిడ్నీల చోరీ ఘటనలను ఖండిస్తూ 'కిడ్నీలు జాగ్రత్త' అనే నినాదంతో ఉన్న బ్యాడ్జీలు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. మరోవైపు పీఎంకేలో అన్బుమణి వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు జీకే మణిని పార్టీ సభాపక్ష నేత పదవి నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోని స్పీకర్ అప్పావు వైఖరిని నిరసిస్తూ నల్ల చొక్కాలతో సభకు హాజరయ్యారు.

కిడ్నీల వ్యవహారంపై కఠిన చర్యలు: మంత్రి సుబ్రమణ్యం

నామక్కల్‌లో జరిగిన కిడ్నీల చోరీ వ్యవహారంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని, అక్రమాలకు పాల్పడిన రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్స లైసెన్స్‌ను రద్దు చేసినట్టు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం తెలిపారు. శాసనసభలో ఈ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రవేశపెట్టిన సావధాన తీర్మానంపై ఆయన మాట్లాడుతూ నామక్కల్‌లో కిడ్నీల చోరీ జరుగుతున్నట్లు ప్రైవేట్ టీవీ ఛానెళ్లలో వార్తలు వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి స్టాలిన్ తక్షణ చర్యలు చేపట్టాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారని, ఆ ప్రకారమే రాష్ట్ర ఆరోగ్య ప్రణాళిక విభాగం సంచాలకుల నాయకత్వంలో విచారణకు ఆదేశించాన్నారు. నామక్కల్, తిరుచ్చి ఆస్పత్రుల్లో తనిఖీలు చేసిన మీదట రెండు ఆస్పత్రుల్లో అవయవమార్పిడి లైసెన్స్‌లను రద్దు చేసి, ఈ వ్యవహారంలో ఇద్దరు బ్రోకర్లను కూడా అరెస్టు చేశామని తెలిపారు. హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ప్రత్యేక దర్యాప్తు విభాగం ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందని, ఆ విచారణ తర్వాత నేరాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలోనే నామక్కల్‌లో కిడ్నీల చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదని, ఈ ఆరోపణలకు సంబంధించి నామక్కల్ పోలీసు ఉన్నతాధికారుల వద్ద తగిన సమాచారం కూడా ఉందని మంత్రి సుబ్రమణ్యం పేర్కొన్నారు.



కిడ్నీలు జాగ్రత్త అంటూ బ్యాడ్జీలతో వచ్చిన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

ఎన్ని అడ్డంకులు ఎదురైనా వచ్చేది అన్నాడీఎంకే పాలనే

- ఈపీఎస్ ధీమా

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులు ఎన్ని ఆటంకాలు కలిగించినా అన్నాడీఎంకే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన చేస్తూ పార్టీ శ్రేణులంతా అసెంబ్లీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారించాలని, బూత్ కమిటీ ఇన్‌ఛార్జులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. 1972 అక్టోబరు 17న ఎంజీఆర్ అన్నాడీఎంకే పార్టీని స్థాపించారని, అప్పట్లో రాష్ట్రంలోని డీఎంకే అవినీతి పాలన అంతమొందించి స్వల్ప కాలంలోనే అధికారంలోకి వచ్చారని తెలిపారు. జయలలిత హయంలోనూ పార్టీ బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. జయలలిత హయాంలో ప్రారంభించిన పథకాలకు డీఎంకే ప్రభుత్వం స్వస్తి పలికిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం అవినీతిలో కూరుకుపోయిన డీఎంకే కుటుంబపాలనను అంతమొందించేందుకు పార్టీ శ్రేణులంతా ఐకమత్యంగా పోరాడాలని ఈపీఎస్ పిలుపునిచ్చారు. ఏది ఏమైనప్పటికీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తుందని, ప్రజలకు సుపరిపాలను అందించడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



గిండిలోని మహాత్మాగాంధీ మండపం ప్రాంగణంలో కట్టబ్రహ్మన్న విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి రాష్ట్రప్రభుత్వం తరుపున నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రులు తదితరులు

కట్టబ్రహ్మన్నకు సీఎం నివాళి

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబ్రహ్మన్న 226వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వం తరపున ఘన నివాళులర్పించారు. గిండిలోని మహాత్మాగాంధీ మండపం ప్రాంగణంలో కట్టబ్రహ్మన్న విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి సహా పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళాభివృద్ధి, సమాచారశాఖ మంత్రి స్వామినాథన్, ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం. హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ఎంపీ తమిళచ్చి తంగపాండియన్, ఎమ్మెల్యే ఎలీళన్, సమాచారశాఖ డైరెక్టర్ డా.ఆర్.వైద్యనాథన్, ప్రభుత్వాధికారులు ఉన్నారు.

ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు పెరిగాయి

- అసెంబ్లీలో మంత్రి చక్రపాణి



ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు పెరిగాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి చక్రపాణి పేర్కొన్నారు. అసెంబ్లీలో గురువారం సమావేశం ప్రారంభమైన వెంటనే ఏడు బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయంలో రైతులనుంచి కొనుగోలు చేసే ధాన్యం బస్తాలు వేల సంఖ్యలో మార్కెటింగ్ కమిటీల్లో పేరుకుపోయాయని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఇందుకు మంత్రి చక్రపాణి సమాధానమిస్తూ డెల్టా, ఇతర జిల్లాల్లో ఈ ఏడాది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం పెరిగిందన్నారు. నాగపట్నం జిల్లాలో గత ఏడాది కంటే 13రెట్లు ధాన్యం ఉత్పత్తి పెరిగిందని, సీఎం స్టాలిన్ ఈ నెల 2న నిర్వహించిన సభలో డెల్టా జిల్లాల వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిసారించడంపై చర్చజరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు సరఫరా చేస్తున్న ధాన్యం బస్తాలు, వర్షంలో తడవకుండా కొత్త గోదాములను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డెల్టా జిల్లా 3.3లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి 25 గిడ్డంగులను ప్రారంభించి 77.196 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వవుంచినట్లు మంత్రి పేర్కొన్నారు.

సమూచార దృశ్ని

'అరియర్స్' రాసేందుకు చివరి అవకాశం

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంఎస్సీ కోర్సులు చదివి, అరియర్స్ ఉన్న విద్యార్థులకు వచ్చే సెమిస్టర్ పరీక్షలు చివరి అవకాశమని అన్నా విశ్వవిద్యాలయం ప్రకటించింది. అన్నా విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రంలో, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంసీఏ చదివిన విద్యార్థులకు పలు అరియర్స్ ఉన్నాయి. అలాంటి వారికి ప్రత్యేక పరీక్ష నిర్వహించాలని అన్నా విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఇప్పటికే వారికి అవకాశం కల్పించగా, చివరి అవకాశంగా నవంబరు లేదా డిసెంబరులో పరీక్ష నిర్వహించనున్నారు. దీనిని అరియర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు. పరీక్ష ఫీజు, ప్రత్యేక ఫీజుగా రూ.5,000 చెల్లించి, https://coe1.annauniv.edu అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నా విశ్వవిద్యాలయం ప్రకటన విడుదల చేసింది.

దీపావళికి ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ రైల్వే అదనపు రైళ్ల టైమ్ టేబుల్‌ను గురువారం విడుదల చేసింది. తాంబరంలో శుక్రవారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరే ప్రత్యేక రైలు (06013) మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు సెంగోట్టై చేరుకుంటుంది. మరుమార్గంలో సెంగోట్టై నుంచి 20వ తేదీ రాత్రి 8.45 గంటలకు బయలుదేరే (06014) ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు తాంబరం చేరుతుంది. ఈ రైలులో ఒక ఏసీ ఛైర్‌కార్, నాలుగు జనరల్ బోగీలు, రెండు సెకెండ్ క్లాస్ కలిపి మొత్తం 18 బోగీలుంటాయి. అదేవిధంగా ఎగ్మూర్ నుంచి మదురైకు అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక మెము నడుపుతారు. (06161) నెంబర్ ఈ రైలు ఎగ్మూర్ నుంచి శుక్రవారం రాత్రి 11.45కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు మదురై చేరుకుంటుంది. 12బోగీల ఈ రైలు మైలాడుదురై, కుంభకోణం, తిరుచ్చి మీదుగా నడపనున్నారు. అదేవిధంగా ఎగ్మూర్ నుంచి ఈ నెల 18వ తేదీ అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక మెము రాత్రి 11.45కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు మదురైకు చేరుకుంటుంది. మారుమార్గంలో మదురై నుంచి 21వ తేదీ రాత్రి 8.30 గంటలకు బయలుదేరే ఈ రైలు మరుసటి రోజుల తెల్లవారుజాము 4 గంటలకు తాంబరం చేరుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

పది, ప్లస్ టూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): త్రైమాసిక పరీక్షల్లో తక్కువ మార్కులు పొందిన పది, ప్లస్ టూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఆ మేరకు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు నిర్వహించిన త్రైమాసిక పరీక్షల్లో తక్కువ మార్కుల వచిచన విద్యార్థుల వివరాలు సేకరించి, ఆ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. పాఠశాల తర్వాత సాయంత్రం, వారాంతపు సెలవు రోజుల్లో ఈ ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఈ-సిమ్

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా తమిళనాడు బీఎస్ఎన్ఎల్, ఈ-సిమ్ సేవలు ప్రారంభించింది. అలాగే, దీపావళి బోనస్‌గా ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. అ ప్రకారం, కొత్త, ఎంఎన్‌పీ వినియోగదారుల కోసం ఈ-సిమ్ సేవలు ప్రారంభించింది. అలాగే, ప్రస్తుత వినియోగదారులు కూడా అవసరమైతే తమ కనెక్షన్లు ఈ-సిమ్‌గా మార్చుకోవచ్చు. దీపావళి బోనస్‌గా కొత్త ఎంఎన్‌పీ వినియోగదారులు, గురువారం నుంచి నవంబరు 15వ తేది వరకు రూ.1 మాత్రమే చెల్లించి సిమ్ పొందవచ్చు. అందులో 30 రోజులు ప్రతిరోజు 2 జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ వసతి పొందవచ్చని తమిళనాడు బీఎస్ఎన్ఎల్ ఒక ప్రకటనలో తెలిపింది.

కోయంబేడు, కీలాంబాక్కంకు అదనంగా లింకు బస్సులు

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా నగరం నుంచి స్వగ్రామాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపుతున్న కోయంబేడు, కీలాంబాక్కం బస్ టెర్మినళ్లకు అదనంగా 275 లింక్ బస్సులను నడపుతున్నట్లు ఎంటీసీ ప్రకటించింది. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి గురువారం నుండి ఈ నెల 19వ తేదీ వరకు కీలాంబాక్కం, కోయంబేడు, మాధవరం బస్ టెర్మినల్స్ వెళ్లే ప్రజల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు ఎంటీసీ తెలిపింది.

సహకార బ్యాంకుల్లో గ్రాముకు రూ.7వేల రుణం

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో నగల రుణాలు గ్రాముకు రూ.7,000 ఇవ్వనున్నారు. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పలురకాలు రుణాలు అందిస్తున్నాయి, బంగారు నగల తాకట్టుపై గ్రాముకు రూ.6,000 రుణం ఇస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, సహకార బ్యాంకుల్లో బంగారంకు అధిక రుణంపై ఇటీవల సహకార శాఖ ఉన్నతాధికారులు సమావేశం నిర్వయించారు. ఈ సమావేశంలో, నగలపై రుణంగా గ్రాముకు రూ.7,000 ఇవ్వాలని నిర్ణయించినట్లు సహకార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కోలీవుడ్ ప్రముఖుల ఇళ్లకు బాంబు బెదిరింపులు!

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నటులు సత్యరాజ్, కార్తీక్, నాజర్, దర్శకుడు అమీర్ నివాసాలకు బాంబు బెదరింపులు రావటంతో పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేశారు.. బుధవారం రాత్రి డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఈమెయిల్‌లో ఈ సినీనటుల నివాసాల్లో కాసేపట్లో బాంబులు పేలతాయంటూ గుర్తుతెలియని వ్యక్తి బెదిరించాడు. దీంతో బుధవారం అర్ధరాత్రి వరకూ వీరి నివాసాల్లో ముమ్మర తనిఖీలు చేసి, చివరకు అది ఉత్తుత్తి బెదిరింపని నిర్ధారణ అయ్యింది.

గుట్కా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వేలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపంలోని క్రిస్టియన్‌పేట చెక్‌పోస్ట్‌లో అక్రమంగా గుట్కా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వచిచన ఓ కారును ఆపి తనిఖీ చేసి, అందుల్లో 324 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన చెన్నారామ్, గణపతిరామ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

● అసెంబ్లీ సమాచారం... మంత్రి ఈవీ వేలు

జనవరిలో మదురై గోరిపాళయం ఫ్లై ఓవర్ ప్రారంభం

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

వచ్చే యేడాది జనవరిలో మదురై గోరిపాళయం వద్ద నిర్మిస్తున్న ఫ్లైవోవర్ ప్రారంభమవుతుందని ప్రజాపనుల శాఖ మంత్రి ఈవీ వేలు తెలిపారు. శాసనసభలో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సెల్లూరు కే రాజు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ గోరిపాళయం ఫ్లై ఓవర్ కళ్లలగర్ వైగై వాగులో వేంచేసే మండపట్టికి చెందిన స్థలం కావడంతో నిర్మాణ పనులు జాగ్రత్తగా జరుగుతున్నాయని, కళ్లలగర్ వైగై వాగులో ప్రవేశించే వేడుకలకు ఆటంకం కలుగని విధంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఇదే విధంగా మదురై అపోలో ఆస్పత్రి ఫ్లైవోవర్ నవంబర్‌లో ప్రారంభమవుతుందన్నారు.

పెరంబూరు ప్రాంతంలో మరిన్ని బస్సులు...

పెరంబూరు నుంచి వివిధ ప్రాంతాలకు మరిన్ని సిటీ బస్సులను నడుపనున్నట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ ప్రకటించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పెరంబూరు బస్టాండు నుండి పెరియపాళయం, కోవళం, చెంగల్పట్టు, శ్రీపెరుంబుదూరు తదితర ప్రాంతాలకు మరిన్ని బస్సులను నడిపే అవకాశం ఉందా అని ఎమ్మెల్యే తాయగం కవి ప్రశ్నించారు. మంత్రి బదులిస్తూ నగర ప్రాంతాల్లో నిర్దేశిత దూరం వరకే సిటీ బస్సులను నడపాలనే నిబంధనలున్నా పెరంబూరు నుంచి దూర ప్రాంతాలకు మరిన్ని బస్సులు నడిపేలా చర్యలు చేపడతామన్నారు.

ఇతర భాషల్లోకి అన్నాదురై రచనలు ...

మాజీ ముఖ్యమంత్రి, దివంగత అన్నాదురై రచనలను ఇతర భాషల్లోకి అనువదించనున్నట్లు సమాచార శాఖ మంత్రి ఎంపీ సామినాథన్ తెలిపారు. శాసనసభలో డీఎంకే సభ్యుడు డాక్టర్ ఎళిలన్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ అన్నాదురై తమిళ, ఆంగ్ల రచనలను ఇతర బాషల్లోకి అనువదించాలని ఇదివరకే ముఖ్యమంత్రి స్టాలిన్ తనకు సూచించారని, ఆ మేరకు త్వరలోనే ఆ రచనల అనువాదం ప్రారంభించనున్నామన్నారు. డీఎంకే ప్రభుత్వ విజయాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే విషయంపై ముఖ్యమంత్రితో చర్చించిన మీదట నిర్ణయం తీసుకుంటామన్నారు.

అసెంబ్లీలో నయినార్ నాగేంద్రన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తరువాత సీఎం స్టాలిన్ మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నయినార్ నాగేంద్రన్ 65వ వసంతంలోకి గురువారం అడుగుపెట్టారని, ఆయన నిండునూరేళ్లు సంతోషంగా జీవించాలని కాంక్షిస్తూ డీఎంకే శాసనసభ్యుల తరుపున శుభాకాంక్షలు తెలిపారు. నాగేంద్రన్ ప్రతిపక్షపార్టీతో పొత్తులో ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని ప్రశాంతంగా విమర్శిస్తారని, చిరునవ్వుతోనే వాకౌట్ చేస్తారని వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు పూశాయి. అనంతరం మంత్రి ఎస్.ముత్తుస్వామికి కూడా సీఎం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తరువాత స్పీకర్ అప్పావు వారిద్దరికీ అసెంబ్లీ తరుపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్నాడీఎంకేకు అప్పుల కోసం మాట్లాడే హక్కులేదు

● అసెంబ్లీలో మంత్రి తంగం తెన్నెరసు



ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పొందిన రుణాలకు ఐదేళ్లుగా వడ్డీ మాత్రమే రూ.1.40లక్షల కోట్లు చెల్లిస్తున్నామని, రుణాల గురించి మాట్లాడే నైతిక హక్కు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలకు లేదని మంత్రి తంగం తెన్నెరసు పేర్కొన్నారు. అసెంబ్లీలో గురువారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రప్రభుత్వం నాలుగున్నరేళ్లలో పొందిన రుణాల గురించి ప్రస్తావించారు. అందుకు మంత్రి తంగం తెన్నెరసు సమాధానమిస్తూ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రతిపక్ష పార్టీలు విమర్శించడం సరికాదన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పొందిన రుణాలకు నాలుగున్నరేళ్లుగా వడ్డీగా రూ.1.40లక్షల కోట్లు చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వంలో 128 శాతం రుణాభారం పెరిగిందన్నారు. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటినుండి నాలుగేళ్లలో 73 శాతం మాత్రమే రుణభారం పెరిగిందన్నారు.

జోరుగా గొర్రెల విక్రయాలు



కల్పకనూర్ సంతలో కొనుగోలుదారులు

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పశువుల సంతల్లో గొర్రెల విక్రయాలు వారం రోజుల ముందు నుంచే ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా సేలం జిల్లా ఆత్తూరు సమీపంలో ఉన్న కొత్తాంబాడి పరిధిలోని కల్పకనూర్‌లో బుధవారం పశువుల సంతలో గొర్రెలు, పశువులు, కోళ్ళ తదితరాల విక్రయాలు జోరందుకున్నాయి. రోజుకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు అమ్మకాలు సాగుతుండటంతో వ్యాపారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. పండుగను పురస్కరించుకుని నాలుగు వారాల క్రితం ఈ ప్రాంతంలో ప్రారంభించిన పశువుల సంత ప్రతి బుధవారం కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటుంది. ఒక్క బుధవారం రోజున మాత్రం సుమారు రూ.కోటికి పైగా వ్యాపారం జరిగిందని రైతులు సంతోషం వ్యక్తంచేశారు. కాగా, పండుగ సందర్భంగా మామూలు రోజులకంటే అధికంగా గొర్రెల అమ్మకాలు సాగుతుండటంపై రైతులు కూడా ఆనందంలో మునిగి తేలుతున్నారు.

ఆది, సోమవారాల్లో వైద్యులకు 'డ్యూటీ' తప్పనిసరి


పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా, ఆది, సోమవారాల్లో వైద్యులు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేది ప్రజలు దీపావళి పండుగ రోజున టపాసులు కాలుస్తూ గాయపడిన వారికి సత్వరం చికిత్స అందించేలా, ఆరోగ్య కేంద్రాలు సిద్ధం చేశారు. వైద్య కళాశాల ఆస్పత్రుల్లో అత్యవసర నిపుణులు, ముఖ్యంగా, మార్చిడి సర్జన్లు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆరోగ్య శాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ డైరెక్టర్ సోమసుందరం విడుదల చేసిన ప్రకటనలో... గ్రామాల్లో పీహెచ్‌సీ దీపావళి రోజున పనిచేస్తాయన్నారు. ముఖ్యంగా, స్వల్పగాయాలకు వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైతే 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రధాన ఆసుపత్రులు, వైద్య కళాశాల ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 424 పీహెచ్‌సీల్లో ఆది, సోమవారాల్లో 24 గంటలకు వైద్యులు అందుబాటులో ఉంటారని, మారుమూల గ్రామాలకు 420 సంచార వైద్య కేంద్రాలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

పూండి జలాల విడుదల పెంపు

● నగర వాసులకు వరద హెచ్చరిక

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరానికి తాగునీరందించే పూండి జలాశయం నుంచి ఔట్ ఫ్లో పెరగడంతో, కొశస్థలి నది తీరప్రాంతాలకు వరద హెచ్చరికలు జారీచేశారు. రాష్ట్రంలో కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా, నగరం, శివారు ప్రాంతాల్లోని జలాశయాలు నిండుతున్నాయి. ఈ క్రమంలో, తిరువళ్లూర్ జిల్లాలోని పూండి జలాశయం పూర్తి సామర్థ్యానికి చేరుకోవడంతో ముందు జాగ్రత్తగా జలాశయం నుంచి బుధవారం 700 ఘనపుటడుగుల అదనపు జలాలను కుశస్థలి నదికి విడుదల చేశారు. బుధవారం వర్షాలు కొనసాగడంతో, పూండి జలాశయం నీటిమట్టం పెరిగిది. ఈ కారణంగా జలాశయం నుంచి 4,500 ఘనపుటడుగుల మేర విడుదల చేస్తున్నారు. దీంతో కొశస్థలి తీరప్రాంతాలకు అధికారులు వరద హెచ్చరికలు జారీచేశారు. అలాగే, పూళల్ జలాశయం నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలను 500 ఘనపుటడుగులకు పెంచారు. ఈ కారణంగా, కాలువ సమీపంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

తేయాకు తోటల్లో పులి సంచారం



సీసీ ఫుటేజీ దృశ్యం

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తేయాకు తోటల్లో పులి సంచరిస్తుండడంతో కార్మికులు భయాందోళన చెందుతున్నారు. నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని తుమ్మంటి గ్రామంలోని రోడ్డు పక్కనే ఉన్న తేయాకు తోటలో పులి ప్రవేశించింది. ఆ సమయంలో, ఆ మార్గంలో వెళ్తున్న వాహనచోదకులు పులిని గుర్తించి, తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. కొద్దిసేపు ఆ ప్రాంతంలో సంచరించిన పులి, సమీపంలోని అడవిలోకి వెళ్లింది. ప్రస్తుతం ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు, తేయాకు తోటలో పనిచేస్తున్న కార్మికులు భయాందోళన చెందుతున్నారు. ఊటీ ఫారెస్ట్ రేంజర్ రాంప్రకాష్ నేతృత్వంలో సిబ్బంది తేయాకు తోటకు చేరుకుని కార్మికులకు ధైర్యం చెప్పారు. అలాగే, ఒంటరిగా ఎవరూ విధులు చేపట్టవద్దని ఫారెస్ట్ అధికారులు కార్మికులను హెచ్చరించారు.

నాటుబాంబులు, గంజాయితో ఇద్దరి అరెస్ట్



నిందితులు

తిరుత్తణి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నాటు బాంబులు, గంజాయి ఉంచుకున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా కొంతమంది యువకులు గంజాయి, గుట్కా తదితర మత్తుపదార్థాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా నేతృత్వంలోని పోలీసులు జిల్లాలోని చెక్‌పోస్టులు, రైల్వేస్టేషన్లు సహా పలు ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో తిరువళ్లూరు వీఎంనగర్‌లోని ఓ ఇంట్లో ఇద్దరు యువకులు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అనుమానించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం పోలీసుల బృందం ఆ యువకులు నివసిస్తున్న ఇంట్లో తనిఖీ చేయగా, నాలుగు నాటుబాంబులు, 4కిలోల గంజాయి గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. పాతకక్షల కారణంగా ప్రత్యర్థిని హతమార్చేందుకే నాటుబాంబులు కొనుగోలు చేసి తమవద్ద ఉంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

టి.నగర్‌లో ఐదు ప్రాంతాల్లో పార్కింగ్

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో వాహనాల పార్కింగ్ కోసం ఐదు ప్రాంతాలు ఎంపిక చేశారు. ఈ ఏడాది దీపావళి పండుగను ఈ నెల 20వ తేది ప్రజలు జరుపుకోనున్నారు. నగరంలో ప్రముఖ వాణిజ్య కేంద్రం టి.నగర్‌లోని దుకాణాలు మూడు రోజుల నుంచే కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాలతో ట్రా ఫిక్ రద్దీ ఏర్పడకుండా ట్రాఫిక్ విభాగం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేసింది. ఆ ప్రకారం, తనికాచలం రోడ్డు జంక్షన్‌లోని మల్టీలెవల్ పార్కింగ్, అన్బళగన్ ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతం, ప్రకాశం రోడ్డులోని కార్పొరేషన్ పాఠశాల, దండపాణి వీధిలోని రామకృష్ణ పాఠశాల, సోమసుందరం మైదానం తదితర ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చని నగర ట్రాఫిక్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

చదురగిరి వెళ్లేందుకు నిషేధం

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చదురగిరి కొండ ఆలయానికి వెళ్లేందుకు నిషేధం విధించారు. మదురై జిల్లా సప్తూర్ చదురగిరి పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో వెలసిన చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రదోషం, అమావాస్య రోజుల్లో ఈ ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. కాగా, ఐపసి నెల శని ప్రదోషం, అమావాస్య సందర్భంగా శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేది వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగున్నాయి. ఈ క్రమంలో, వర్షాల కారణంగా భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం నుంచి ఐదు రోజులు చదురగిరి ఆలయానికి వెళ్లేందుకు నిషేదం విధించినట్లు అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది.

రవాణా శాఖ ఉద్యోగులకు దీపావళి బోనస్

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగులకు దీపావళి బోనస్ ప్రకటించారు. అలాగే, చక్కెర కర్మాగారాల్లో పనిచేస్తున్న 5,308 మంది కార్మికులకు కూడా బోనస్ ప్రకటించారు. ఈ విషయమై రవాణా శాఖ మంత్రి శివశంకర్ మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా రవాణా శాఖలో పనిచేస్తున్న 1,05,955 మంది ఉద్యోగులకు బోనస్, గ్రాట్యుటీ నిధిగా రూ.175.51 కోట్లు వారి బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు తెలిపారు.

సహకార సంఘాల ఉద్యోగులకు 20 శాతం...

సహకార సంఘాల ఉద్యోగులకు 20 శాతం దీపావళి బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... సహకార సంఘాలకు కేటాయించిన మిగులు పరిగణలోకి తీసుకుని 20 శాతం బోనస్ ఇస్తున్నట్లు తెలిపింది. మిగులు లేని సంఘాల్లో పనిచేసే వారికి 10 శాతం బోనస్, గ్రాట్యుటీ అందిస్తున్నామని, అలాగే, నికర లాభం పొందని ఉద్యోగులకు రూ.2,400 గ్రాట్యుటీ అందజేయనున్నట్లు తెలిపింది. ఆ ప్రకారం, 44,081 మంది ఉద్యోగులకు రూ.44.11 కోట్లు బోనస్, గ్రాట్యుటీగా అందజేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

అబ్దుల్ కలాం ట్రస్ట్ అన్నదానం




అన్నదానం చేస్తున్న అబ్దుల్ కలాం ట్రస్ట్ నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆర్కాడు బస్టాండ్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో, తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు గోపినాథ్, ఆర్కాడు పట్టణ పంచాయతీ అధ్యక్షులు దేవి బెన్స్‌పాండియన్, ఉపాధ్యక్షులు పవళకొడి, శరవణన్, మాజీ అధ్యక్షులు పొన్ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో నవంబరు బియ్యం కూడా పంపిణీ

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో బియ్యం కార్డుదారులు, నవంబరు నెల బియ్యం ఈ నెలలోనే అందుకోవచ్చని ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... రుతుపవనాల ప్రభావంతో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందనే వాతావరణ కేంద్రం హెచ్చరికలతో, బియ్యం కార్డులకు నవంబరు నెలకు సంబంధించిన బియ్యం ఈ నెలలోనే అందజేయనున్నామన్నారు. ఈ నెల బియ్యం తీసుకున్నవారు, ఇప్పటివరకు తీసుకోనివారు, నవంబరు బియ్యం పొందవచ్చని తెలిపారు.

తీర్థగిరి కొండల్లో విత్తన బంతులు



విత్తనపు బంతులు విసురుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం పంచాయతీ పరిధిలోని తీర్థగిరి కొండ లో విత్తనపు బంతులు వేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి గురువారం ప్రారంభించారు. సమాజ సేవకుడు దినేష్ శరవణన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వేలూరు యూనియన్ కమిటీ అధ్యక్షురాలు అముద, ఉపాధ్యక్షురాలు మహేశ్వరి, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ తిరుమాల్, తహసీల్దార్ వడివేలు, బీడీఓలు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలు బాగుచేయండి : అన్నాడీఎంకే



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అన్నాడీఎంకే నేతలు

వేలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్లు, కాలువలు మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని పలు రోడ్లు జలమయంగా మారాయి. నీరు రోడ్లపై ప్రవహించి వాహనచోదకులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో, పట్టణంలో దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలని, డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టాలని కోరుతూ అన్నాడీఎంకే జిల్లా సెక్రటరీ అప్పు గురువారం కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

కౌన్సిలర్ సొంత నిధులతో డ్రైనేజీ పనులు



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ విజయులు

తిరుత్తణి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ పరిధిలోని 2వ వార్డులో మరమ్మతులకు గురైన డ్రైనేజీ కాలువ పనులను ఆ వార్డు కౌన్సిలర్ విజయులు సొంత నిధులతో చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని కౌన్సిలర్ విజయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండో వార్డు పరిధిలో గత కొన్ని నెలలుగా డ్రైనేజీ కాలువలు మరమ్మతులకు గురయ్యాయని ప్రజలు తనకు విజ్ఞప్తి చేశారన్నారు. ఈ నేపథ్యంలో, తన సొంత నిధులతో డ్రైనేజీ పనులను పూర్తిచేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే నేతలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, ప్రజల కోసం పాటుపడేది ఒక్క డీఎంకే మాత్రమేనన్నారు.కార్యక్రమంలో రెండోవార్డు డీఎంకేపార్టీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎంకే కార్యాలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయం నుంచి జిల్లా డీఎంకే కార్యాలయంలో పేదలకు చేసే అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. గురువారం కూడా సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని వేలూరు జిల్లా డీఎంకే సెక్రటరీ, ఎమ్మెల్యే నందకుమార్ నేతృత్వంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆస్పత్రిలో చేరిన నల్లకన్ను

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను (100) అస్వస్థతకు గురికావంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. నల్లకన్ను ఆగస్టు 22వ తేది ఇంట్లో జారి పడడంతో తలకి గాయమైంది. దీంతో, ఆయనను నందనంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొంది ఈ నెల 11న డిశ్చార్జి అయ్యారు. ఈ క్రమంలో, మళ్లీ ఆయన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడంతో గురువారం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వృద్ధాప్యం కారణంగా అస్వస్థతకు గురైన ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

బంగ్లాదేశ్ మహిళ సహా ముగ్గురికి తలా రెండేళ్ల జైలుశిక్ష

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్‌లో చట్టవిరుద్ధంగా ఉంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన మహిళ సహా ముగ్గురికి తలా రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరుప్పూర్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తిరుప్పూర్ ఇడువంపాళయంలో చట్టవిరుద్ధంగా బంగ్లాదేశ్‌కు చెందిన యువకులు నివశిస్తున్నారని అందిన సమాచారంతో ఫిబ్రవరి 24న వీరపాండి పోలీసులు ఆయా ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ఆ సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన ముషాలి బడా (26), నిషా అక్తర్ (23), ఎండీ రోని (22) అనే మహిళను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసు విచారణ తిరుప్పూర్ అదనపు జిల్లా ,సెషన్స్ కోర్టులో జరుగుతున్న నేపథ్యంలో, విచారణ పూర్తికావడంతో, అరెస్ట్ చేసిన ముగ్గురికి తలా రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ శ్రీధర్ బుధవారం తీర్పు వెలువరించారు.

ఎంపీ కనిమొళి తల్లికి అస్వస్థత

పెరంబూర్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):ఎంపీ కనిమొళి తల్లి రాజాత్తి అమ్మాళ్ అస్వస్థత కారణంగా ఆస్పత్రిలో చేరారు. దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి భార్య రాజాత్తి అమ్మాళ్ సీఐటీ కాలనీలో కుమార్తె కనిమొళితో నివసిస్తున్నారు. ఆమె కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా,గతఏడాది జర్మనీలోని ప్రముఖ ఆస్పత్రిలో 20రోజులపాటు చికిత్స పొందారు. హఠాత్తుగా రాజాత్తి అమ్మాళ్ అస్వస్థతకు గురికావడంతో గ్రీమ్స్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నారు. వృద్ధాప్య కారణంగా అనారోగ్యానికి గురయ్యారని, తగిన చికిత్స అందిస్తున్నామని, చికిత్స అనంతరం ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుటపడిందని వైద్యులు తెలిపారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడిన మహిళ

● రూ.4.94 లక్షలకు టోకరా

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండో వరుడి కోసం ఆన్‌లైన్‌లో గాలిస్తున్న మహిళను రూ.4.80 లక్షల మేర మోసం చేసిన వ్యవహారంపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు. కన్నియాకుమారి జిల్లా దేవికోడు ప్రాంతానికి చెందిన కీతు (35) భర్త నుంచి విడిపోయి వేరుగా ఉంటోంది. రెండో వివాహం చేసుకోవాలనుకున్న ఆమె వివాహ వెబ్‌సైట్‌లో తన వివరాలు నమోదుచేసింది. ఆ సమయంలో, న్యూజిలాండ్ నుంచి మాట్లాడుతున్నట్లు ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. వీరు చాలా రోజుల పాటు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో, రెండు రోజుల క్రితం, ఆ వ్యక్తి, కీతును కలిసేందుకు ఇండియా వస్తున్నట్లు తెలిపాడు. ఈ క్రమంలో, మంగళవారం కీతుకు ఫోన్ చేసిన ఓ మహిళ హిందీలో మాట్లాడుతూ.. విదేశాల నుంచి వ్యక్తి వద్ద అధిక మొత్తంలో నగదు ఉందని, అతను విమానాశ్రయం నుంచి సురక్షితంగా బయటకు రావాలంటే రూ.5 లక్షలు చెల్లించాలని తెలిపింది. దీంతో, కీతు పలు విడతలుగా రూ.4.94 లక్షలు ఆ మహిళ తెలిపిన బ్యాంక్ ఖాతాకు జమచేసింది. బుధవారం మళ్లీ ఫోన్ చేసిన సదరు మహిళ, మరో రూ.5 లక్షలు కావాలని తెలిపింది. ఈ వ్యవహారంపై అనుమానించిన కీతు, నాగర్‌కోయిల్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

మాదకద్రవ్యాల కేసుల్లో 8,983 మంది జైలుశిక్ష

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల కేసుల్లో మూడేళ్లలో 8,983 మందికి జైలుశిక్ష విధించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ తరలింపు, విక్రయాలు చేపట్టిన వారిని పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. సాక్ష్యాలు సమర్పించి జైలు శిక్ష పడేలా చర్యలు చేపడుతున్నారు. ఆ ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో అరెస్టయిన వారికి సంబంధించిన కేసుల్లో, 8,983 మందికి జైలు శిక్ష విధించారు. ఆ ప్రకారం, 2023లో 2,988 మంది, 2024లో 2,308, 2025 (ఆగస్టు నెల వరకు) 3,687 మందికి ఆయా న్యాయస్థానాలు జైలుశిక్ష విధించాయని, రాబోయే కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పోలీసులు పేర్కొంటున్నారు.

విషవాయువు సోకి కార్మికుడి మృతి

పెరంబూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తోళ్ల ఫ్యాక్టరీలోని మురుగునీటి ట్యాంక్ శుభ్రం చేస్తున్న కార్మికుడు విషవాయువు సోకి మృతిచెందాడు. రాణిపేట సమీపంలోని కర్మాగారంలోని ట్యాంక్‌ను గురువారం ఉదయం రామన్ అనే కార్మికుడు శుభ్రం చేసేందుకు దిగారు.. ట్యాంక్‌లో దిగిన రామన్ విషవాయువు సోకడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. రామన్‌ను రక్షించేందుకు యత్నించిన కర్మాగారం యజమాని రైస్ అహ్మద్, సహచర కార్మికుడు కుమార్ స్పృహ తప్పి పడిపోయారు. చుట్టుపక్కల వారు వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి ఆయిల్‌తో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కం ప్రాంతంలో గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేసిన పోలీసులు గంజాయి నూనెతో ఇద్దరి అరెస్టు చేశారు. అనుమానాస్పదంగా సంచరించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారినుండి 1,0280 గ్రాముల గంజాయి ఆయిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు అదే ప్రాంతానికి చెందిన ప్రిన్స్ (38), సమీర్ (43)గా గుర్తించి సైదాపేట కోర్టులో హాజరుపరిచిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

చిత్రజ్యోతి

'అరసన్' చిత్రానికి అనిరుధ్ సంగీతం

● శింబు లుక్ రిలీజ్

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ - హీరో శింబు కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'అరసన్' చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూర్చనున్నారు. ఉత్తర చెన్నైలో గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందే ఈ చిత్రంలో సముద్రఖని, కిషోర్, ఆండ్రియా, దర్శకుడు నెల్సన్ తదితరులు నటించనున్నారు. ఇటీవలే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను 'వి క్రియేషన్స్' పతాకంపై నిర్మిస్తుండగా, హీరో శింబు ద్విపాత్రాభినయం చేయనున్నారు. ఈ నేపథ్యంలో 'అరసన్' సినిమా ప్రోమో రిలీజ్ చేస్తూనే సంగీత దర్శకుడి పేరు వెల్లడించి, శింబు లుక్‌ను కూడా వెల్లడించారు.



'అరసన్'లో సిలంబరసన్

దీపావళి రేసులో ముగ్గురు హీరోల మధ్య పోటీ



'డీజిల్'లో హరీష్ కళ్యాణ్ - అతుల్యారవి



'డ్యూడ్'లో ప్రదీప్ రంగనాథన్ - మమిత బైజు



'బైసన్'లో ధ్రువ్ విక్రమ్

దీపావళి పండుగ రేసులో ముగ్గురు హీరోల చిత్రాలతో పాటు మొత్తం ఐదు విడుదలవుతున్నాయి. వాటిలో ఒకటి హరీష్ కళ్యాణ్ హీరోగా నటించిన 'డీజిల్', ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడుగా తెరకెక్కిన 'డ్యూడ్', సీనియర్ నటుడు విక్రమ్ కుమారుడు ధ్రువ్ ప్రధాన పాత్ర పోషించిన 'బైసన్' ఉన్నాయి. వీటితో పాటు మరికొన్ని చిన్న చిత్రాలు కూడా ఈ దీపావళికి రిలీజ్ అవుతున్నాయి. అయితే, ఈ దఫా పెద్ద హీరో నటించిన ఒక్క సినిమా కూడా దీపావళికి రిలీజ్ కావడం లేదు. ఈ చిత్రాల్లో ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్యూడ్' ఫ్యామిలీ, లవ్ ఎంటర్‌టైన్మెంట్ మూవీ. ధ్రువ్ నటించిన 'బైసన్' మూవీని దర్శకుడు మారి సెల్వరాజ్ కబడ్డీ నేపథ్యంలో రూపొందించారు. అనుపమ పరమేశ్వరన్, రజీషా విజయన్ హీరోయిన్లు. ఇప్పటికే ఈ చిత్రం ఆడియో సూపర్ హిట్ అయింది. హరీష్ కళ్యాణ్ నటించిన 'డీజిల్' చిత్రం ఇంధన మాఫియాను నేపథ్యంగా చేసుకుని తెరకెక్కించారు. షణ్ముగం ముత్తుస్వామి దర్శకుడు. అతుల్యా రవి హీరోయిన్. 'లబ్బర్ పందు', 'పార్కింగ్' వంటి హిట్ చిత్రాల తర్వాత 'డీజిల్' మూవీ రానుంది. అలాగే, మరో మూడు చిత్రాలు విడుదలకానున్నాయి. దీపావళికి విడుదలయ్యే చిత్రాల్లో ప్రేక్షకులు ఏ చిత్రాలను ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

లైకా కేసులో కౌంటర్ వేయాలని విశాల్‌కు ఆదేశం



తమ సంస్థకు చెల్లించాల్సిన రూ.21.29 కోట్ల రుణానికి 30 శాతం వడ్డీ కలిపి తిరిగి చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ దాఖలు చేసిన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని హీరో విశాల్‌కు మద్రాస్ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నటుడు విశాల్ తన సొంత నిర్మాణ సంస్థ విశాల్ ఫిల్మ్ ప్రొడక్షన్ కోసం గోపురం ఫిలిమ్స్ నుంచి రూ.21.29 కోట్ల రుణంగా తీసుకున్నారు. ఈ రుణాన్ని తాము చెల్లిస్తామని లైకా ప్రొడక్షన్ ముందుకు వచ్చి ఆ మొత్తాన్ని గోపురం ఫిలిమ్స్‌కు చెల్లించింది. అదేసమయంలో విశాల్ నటించే అన్ని చిత్రాల పంపిణీ హక్కులు లైకాకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ, ఈ ఒప్పందాన్ని విశాల్ పాటించలేదు. దీంతో లైకా నిర్మాణ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. రూ.21.29 కోట్ల రుణానికి 30 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని గతంలో ఆదేశించింది. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో వీటిని అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని లైకా సంస్థ మళ్ళీ కోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్‌ను విచారణకు హైకోర్టు స్వీకరించింది. విశాల్ 'మగుడం' అనే చిత్రంలో నటిస్తున్నారని, ఆ చిత్రానికి తీసుకునే రెమ్యునేషన్‌ను హైకోర్టులో డిపాజిట్ చేసేలా ఆదేశించాలని లైకా తరఫున హాజరైన న్యాయవాది కోరారు. ఈ వాదనలు ఆలకించిన కోర్టు... కౌంటర్ దాఖలు చేయాలని విశాల్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

ఆధ్యాత్మికం

అమ్మవారి అభయం.. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహం

● శత్రుభయాలను తొలగించే చతుర్ముఖ మురుగన్

● విశ్వామిత్రుడు దర్శించిన క్షేత్రం

దిండుగల్‌కు సుమారు 15 కి.మీ.ల దూరంలో కండాంగి చీరలకు ప్రసిద్ధి చెందిన చిన్నాలపట్టిలో తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ చతుర్ముఖుడై భక్తులను అనుగ్రహిస్తున్నారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారి అనుగ్రహంతో చతుర్ముఖాలతో మురుగన్ దర్శనమిచ్చే ఏకైక శైవక్షేత్రంగా చిన్నాలపట్టి ఆలయం భాసిల్లుతోంది. 'ఓం' అనే ప్రణవమంత్రం అర్ధం తెలియక బ్రహ్మదేవుడు మురుగన్‌ను బంధించారు. దీంతో సృష్టి కార్యాలకు అంతరాయం ఏర్పడకుండా షణ్ముఖుడే బ్రహ్మదేవుడిలా చతుర్ముఖుడిగా సృష్టికార్యం చేపట్టాడని స్థలపురాణం. ఆ సంఘటన తలపించేలా ఈ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యస్వామి చతుర్ముఖ మురుగప్పెరుమాన్ అని కీర్తింపబడుతున్నారు.


- టి.నగర్, ఆంధ్రజ్యోతి



ఆలయ రాజగోపురం



దక్షిణామూర్తి



పరమేశ్వరుడి సన్నిధి



చతుర్ముఖ మురుగప్పెరుమాన్



బాలాత్రిపురసుందరి

ఆలయవైభవం...

ఈ ఆలయ రాజగోపురం దక్షిణం వైపుంది. దాని పక్కనే ముఖమండపం, మహామండపం, అర్ధమండపం ఉన్నాయి. వీటి తర్వాత గర్భాలయంలో మూలవిరాట్టు శివసుబ్రహ్మణ్యస్వామి, వళ్ళి, దేవసేన సమేతుడై కొలువై ఉన్నారు. స్వామివారి కుడి చేతిలో శంఖుముద్ర, ఎడమచేత చక్రముద్ర ఉన్నాయి. వక్షస్థలంపై గౌరి శంకర రుద్రాక్ష ధరించారు. ప్రాకారం కన్ని మూలలో గణపతి, వాయువ్యంలో దండాయుధపాణి, ఈశాన్యంలో భైరవుడు కొలువై ఉన్నారు. ఇదే విధంగా బాలసుబ్రహ్మణ్యస్వామి, కుక్కుటేశ్వరస్వామి, చండికేశ్వర్లు, దక్షిణామూర్తి తదితర దేవతామూర్తులు, నవగ్రహసన్నిధులు కూడా ఉన్నాయి. మహామండపంలో మురుగప్పెరుమాన్ చతుర్ముఖుడై మయూరవాహనంపై దక్షిణ దిశగా ఆశీనుడై భక్తులను అనుగ్రహిస్తున్నారు. పక్కనే బాలా త్రిపురసుందరి, అంబిక, విశ్వామిత్రుడి విగ్రహాలు కూడా ఉన్నాయి.

స్థలపురాణం...

బ్రహ్మర్షి విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేయగా, అతడికి బాలిక రూపంలో బాలాత్రిపురసుందరి ప్రత్యక్షమై తన నుదుట కుంకుమ బొట్టుపెట్టమని కోరింది. విశ్వామిత్రుడు ఆ బాలిక నుదట కుంకుమబొట్టు పెట్టారు. ఆ బొట్టు సక్రమంగా ఉందో లేదోనని బాలా త్రిపురసుందరి పక్కనే ఉన్న తీర్థకొలనులో తన బింబాన్ని చూసింది. తీర్థకొలనులో వంగి చూస్తున్న సమయంలో బొట్టు కొంత భాగం జారి కొలనులో పడింది. దీంతో ఆ కొలను నుండి చతుర్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆవిర్భవించారు. ఆ చతుర్ముఖ మురుగన్ నీ కోరిక నెరవేరుస్తాడని విశ్వామిత్రుడికి చెప్పి బాలా త్రిపురసుందరి అంతర్ధానమైంది. చతుర్ముఖ మురుగప్పెరుమాన్ కూడా ఆ ప్రాంతానికి కొంత దూరంలో ఉన్న ఆలయానికి రమ్మని తెలిపి మాయమయ్యారు. విశ్వామిత్రుడు మురుగప్పెరుమాన్ మాట ప్రకారం ఆలయానికి వెళ్ళినప్పుడు చతుర్ముఖ మురుగప్పెరుమాన్, బలాత్రిపురసుందరి ఒకే చోట దర్శనమివ్వడంతో విశ్వామిత్రుడు 'దైవానుగ్రహం కోసం తపస్సు చేయకుండా బ్రహర్షి బిరుదు కోసం తపస్సు చేశానని దిగులు చెందుతాడు. అదే సమయంలో ఆ ప్రాంతానికి విచ్చేసిన వశిష్ఠ మహర్షి విశ్వామిత్రుడిని ఆశీర్వదించి బ్రహ్మర్షి బిరుదు ప్రదానం చేస్తారు.

ఆలయ విశేషాలు..

ఈ ఆలయంలో మంగళవారాల్లో ఉదయం ఎనిమిది గంటలకు చతుర్ముఖ మురుగన్‌కు ఆవుపాలలో కుంకుమపూవు కలిపి ఆ మిశ్రమంతో అభిషేకం చేస్తారు. ఈ అభిషేకం చేస్తే అంగారక దోషం నుండి విముక్తి చెందుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శత్రుభయాలు, వివాహ ఆటంకాలు తొలగిపోతాయని, సంతానం కలుగుతుందని చెబుతారు. బాలాత్రిపురసుందరికి చీర కానుకగా సమర్పిస్తే విద్యలో రాణించి జ్ఞానం ప్రాప్తిస్తుందని చెబుతారు. వయ్యాశి విశాఖం, కార్తీక దీపోత్సవం, ఆశ్వయుజ మాసంలో స్కంధషష్ఠి, శూరసంహారం, తిరుకల్యాణం తదితర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

ఎలావెళ్ళాలి?

రాష్ట్రంలో చెన్నై సహా పలు ప్రముఖ నగరాల నుండి దిండుగల్‌కు బస్సులు నడుపుతున్నారు. దిండుగల్ బస్‌స్టేషన్ నుండి టౌన్ బస్సులు, ఆటోల్లో చిన్నాలపట్టి చతుర్ముఖ మురుగన్ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 7 నుండి 11 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి రాత్రి 8.30 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



వెలుపలి ప్రాకారం

29 నుంచి నగరంలో 'విండెర్జీ' సదస్సు



మీడియా సమావేశంలో నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పవన విద్యుత్‌కు సంబంధించిన అంతర్జాతీయ ప్రదర్శన ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో జరుగనుంది. ఈ వివరాలను ఫ్లెండర్ ఇండియా హోల్ టైం డైరెక్టర్ పాండు చిల్లకూరు, 'ఇండియన్ విండ్ టర్బైన్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యూటీఎంఏ) వైస్ ఛైర్మన్ డాక్టర్ శరవణన్ మాణిక్యం, సీఈవో ఆదిత్య ప్యాసి గురువారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయమంత్రి శ్రీపాద యెస్సో నాయక్ ప్రారంభించనున్నారు. సుమారు 20 దేశాల నుంచి 350 మందికి పైగా ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, 15 వేల మందికి పైగా సందర్శకులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

వీరపాండ్య కట్ట బ్రహ్మన్నకు పలువురి నివాళి



అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నివాళి

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగుతల్లి ముద్దుబిడ్డ వీరపాండ్య కట్టబ్రహ్మన్న 226వ వర్ధంతిని పురస్కరించుకొని గిండి గాంధీ మండపంలో ఉన్న కట్ట బ్రహ్మన్న విగ్రహానికి గురువారం పలు పార్టీల నాయకులు, తెలుగు వారు ఆయనకు ఘననివాళులర్పించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి రాజాఅన్నామలైపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కట్టబ్రహ్మన్న విగ్రహానికి నివాళులర్పించారు. మక్కల్ మున్నేట్ర ట్రస్ట్, వీరపాండ్య కట్టబొమ్మన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.ఇళయ కట్టబొమ్మన్ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక, సాహస క్రీడా యువ కళాకారులు పాల్గొని నివాళులర్పించారు. అలాగే, ఆంగ్లేయులతో సమరయోధులు యుద్ధం చేసిన ఆయుధాలతో ఏర్పాటుచేసిన ప్రదర్శన విదేశీయులు, స్వదేశీయులను ఆకట్టుకుంది. సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కట్టబ్రహ్మన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థల కళాకారులు మహాత్మాగాంధీ, చాచా నెహ్రూ, సుబ్రమణ్య భారతి, నేతాజీ, పెరియార్, డా.అంబేడ్కర్, భారతమాత తదితర వేషాలతో అలరించారు. అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా.నాయకర్ నందగోపాల్, ఉపాధ్యక్షులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు, నిర్వాహకులు కేవీ జనార్ధనం, వంజరపు శివయ్య, భుజంగరామ్, నమో గాడ్ ఛారిటబుల్ ట్రస్టీ డా.ఎస్.నాగభూషణం తదితరులు నివాళులర్పించారు. తమిళనాడు తెలుగు పీపుల్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డా.దేవరకొండ రాజు, డా.శ్రీకాంత్ మల్లంపాటి, ద్రావిడ తెలుగుదేశం పార్టీ రాష్ట్రఅధ్యక్షులు ముని ఆర్ముగం, డీఎంకే ఎంపీ టీకేఎస్ ఇళంగోవన్ తదితరులు నివాళులర్పించారు.



కట్టబ్రహ్మన్నకు నివాళులర్పిస్తున్న టీటీపీఎస్ అధ్యక్షుడు దేవరకొండ రాజు, ఇళయ కట్టబొమ్మన్ తదితరులు



డీటీపీ అధ్యక్షులు మునిఆర్ముగం తదితరుల నివాళి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జీవీ సంపత్

'నరువి'లో రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స

వేలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరువి ఆస్పత్రిలో రోబో ద్వారా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయమై గురువారం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆస్పత్రి ఛైర్మెన్ డా.జీవీ సంపత్ మాట్లాడుతూ... ఐదేళ్ల క్రితం ప్రారంభించిన ఆస్పత్రిలో గుండె, ఊపిరితిత్తులు, మధుమేహం, రక్తపోటు, పేగులు, నాడీ సంబంధిత చికిత్స అందిస్తున్నామన్నారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి చికిత్స కోసం తమ ఆస్పత్రికి వస్తున్నారని తెలిపారు. చికిత్స కోసం అత్యాధునిక వైద్య పరికరాలు వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో, ఇంగ్లాండ్ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబో ద్వారా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన 56 ఏళ్ల యువతికి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ జీవీ సంపత్ తెలిపారు.

రోడ్ల మరమ్మతులకు 21 కొత్త వాహనాలు

● ప్రారంభించిన మేయర్ ప్రియ

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్ల మరమ్మతుల కోసం కొనుగోలు చేసిన 21 కొత్తవాహనాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని 200వార్డుల్లో చేపడుతున్న రోడ్ల మరమ్మతు పనుల నిమిత్తం ఆధునిక సదుపాయాలతో డిజైన్ చేసిన 21 వాహనాలు, వీధికుక్కలను వేటాడేందుకు 5 వాహనాలను అందుబాటులోకి వచ్చాయి. ఐడీబీఐ, ఈక్విటాస్ బ్యాంకుల ఆధ్వర్యంలో సామాజిక వాటానిధి కింద విడుదల చేసిన రూ.52.17 లక్షలతో ఈ వాహనాలు కొనుగోలు చేశారు. ప్రారంభోత్సవంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుబరన్, సంయుక్త కమిషనర్ జయశీలన్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 5, 6 జోన్లలో సమ్మె చేపట్టిన పారిశుధ్య కార్మికులను మళ్లీ విధుల్లోకి చేర్చుకుంటామని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు.



కొత్తవాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న అమర్‌సేవా సంఘం వ్యవస్థాపకుడు ఎస్.రామకృష్ణన్, గౌరవ కార్యదర్శి ఎస్. శంకరరామన్



చెన్నైలో వళ్లువర్‌కోట్టమ్‌ను గురువారం ఉదయం సందర్శించిన విదేశీ పర్యాటకులు

నాలుగేళ్లలో 4వేల ఆలయాలకు మహాకుంభాభిషేకం : మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4వేల ఆలయాలకు మహాకుంభాభిషేకం పూర్తిచేసినట్లు దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో పుదుకోట ఎమ్మెల్యే డా.ముత్తురాజా, ఉసిలంపట్టి ఎమ్మెల్యే అయ్యప్పన్, తిరుపత్తూరు ఎమ్మెల్యే నల్లతంబి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ పుదుకోట జిల్లాలో ప్రసిద్ధి చెందిన బృహదాంబ ఆలయంలో రూ.46లక్షలతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులను డిసెంబర్ నాటికి పూర్తిచేసి 2026 జనవరి 26న మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెన్నైలో మ్యారిటైం ఇండియా ఫౌండేషన్, ఐఐటీ మద్రాస్‌కు చెందిన 'నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్, వాటర్‌వేస్ అండ్ కోస్ట్స్' ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన 'ఇండియాస్ మ్యారిటైం హ్యాక్‌థాన్'ను జ్యోతిప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభిస్తున్న చెన్నై పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ సునీల్ పాలివాల్, డిప్యూటీ చైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ డాక్టర్ వి.కామకోటి, కామరాజర్ పోర్ట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జేపీ ఇరేన్ సైంథియా తదితరులు







ఏఐటీఎఫ్ అధ్యక్షుడు సీఎంకే రెడ్డి, గొల్లపల్లి ఇశ్రాయేల్ తదితరుల నివాళి



'కే-ర్యాంప్' పద్ధతైన సినిమా

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కే-ర్యాంప్' చాలా పద్ధతైన సినిమా అని, ఫ్యామిలీతో కలిసి చూడవచ్చని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆ చిత్ర దర్శకుడు జైన్స్ నానితో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అక్టోబరు 18న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చామన్నారు. కాగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే చిత్రంతో పాటు మరో రెండు ప్రాజెక్టులు కూడా చేస్తున్నట్టు వెల్లడించారు.

కిరణ్ అబ్బవరం, జైన్స్ నాని

శ్రీవారి సేవలో ప్రముఖులు





గుమ్మనూరు జయరాం - శంకర్ గౌడ్, కిరణ్‌రాయల్

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, హైదరాబాద్ హిమాయత్‌నగర్ టీటీడీ ఎల్‌ఏసీ చైర్మన్ శంకర్ గౌడ్, తిరుపతి జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ ఉన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించండి

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్యరైల్వే గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ ఆధునికీకరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని వసతులు పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. డీఈఈ వీరయ్య, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఎస్ఎస్ఈలు సిద్దారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.79 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,919

తలనీలాలు సమర్పించినవారు: 28,218



యువతే మన దేశ సంపద



ఎస్వీయూ ఏడీ భవనం ముందు కళా ప్రదర్శనగా వస్తున్న విద్యార్థులు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం

- 'యువతరంగ్' ప్రారంభోత్సవంలో ఎస్వీయూ వీసీ
- ఆకట్టుకున్న ర్యాలీ, కళా ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశానికి నిజమైన సంపద అని ఎస్వీ యూనివర్సిటీ వీసీ టి.నరసింగరావు పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే 'యువతరంగ్-2025' గురువారం ప్రారంభమైంది. శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సభలో వీసీ మాట్లాడారు. కళలు మనిషిని మానవీయంగా మారుస్తాయని అభిప్రాయపడ్డారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. ప్రస్తుతం వీలైన మేరకు సంగీతాన్ని సాధన చేస్తున్నట్లు చెప్పారు. యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. యూనివర్సిటీ విద్యార్థులను అద్భుతమైన క్రీడాకారులుగా, కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు సూచించారు. యూనివర్సిటీ పరిధిలో కళలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, ఆర్ట్స్ కామర్స్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో- ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, స్వరూప్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. అంతకుముందు అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం దాకా కళాబృందాలు, విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు.





ప్రత్యేక ఆకర్షణగా కిరణ్ అబ్బవరం

యువతరంగ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు కిరణ్ అబ్బవరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తానెంతో ఉత్తేజం పొందానని చెప్పారు. తనకు వచ్చిన గుర్తింపునకు యువత ముఖ్య కారణమన్నారు. తనకు పాతికేళ్ల వయసులో జీవిత లక్ష్యం అర్థమైందని, సినిమా రంగంలో కళాకారుడిగా రాణిస్తాననే నమ్మకం పెరిగిందని గుర్తుచేసుకున్నారు.

రసవత్తరంగా పోటీలు

గురువారం మధ్యాహ్నం నుంచి మూడు సమాంతర వేదికలపై చేపట్టిన సాంస్కృతిక పోటీలు రసవత్తరంగా సాగాయి. సుమారు 30 అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, కళా బృందాలు ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భార్యకు నిప్పంటించిన భర్త

చంద్రగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు. ఆపై గొడవ. దీంతో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు వెంకటేష్. ఈ ఘటన చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ పరిధిలోని ఉగ్రప్రత్యింగిరాదేవి ఆలయం సమీపంలోని నిమ్మతోటలో మంగళవారం రాత్రి జరిగింది. వెంకటేష్, హరిత దంపతులది సదుం మండలం. తొండవాడ సమీపంలోని వెంకటకృష్ణ నిమ్మతోటకు ఎనిమిదేళ్లుగా కాపలాదారులుగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి భార్యభర్తలు మద్యం తాగారు. ఆపై వారి మధ్య గొడవ జరగడంతో అక్కడే ఉన్న పెట్రోల్‌ను భార్యపై పోసి నిప్పటించాడు. ఆమె కేకలు వేస్తుండగా, వెంకటేష్ రోడ్డుపైకి వచ్చి జరిగిన విషయాన్ని స్థానికులు చెప్పాడు. ఆమెను 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరు 18నుంచి యంగ్ బర్డర్ శిబిరం

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పక్షులు,పర్యావరణంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఐసర్, షోలా స్కై ఐలాండ్స్ సంయుక్తంగా ఓ శిబిరం నిర్వహించనున్నాయి. యంగ్ బర్డర్ పేరిట డిసెంబరు 18 నుంచి 22 వరకు ఐసర్ ప్రాంగణంలో శిబిరం నిర్వహించనున్నారు. 14 నుంచి 18 ఏళ్ల ఔత్సాహిక విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చునని ఐసర్ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబరు 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 20 మందిని ఎంపిక చేయనున్నారు. పర్యావరణం,పక్షుల పట్ల ఆసక్తి, ప్రకృతిపై అనురక్తి పెంపొందించేందుకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. దరఖాస్తుతో పాటు మర్ని వివరాలకు 'స్కైలాండ్.ఇన్./వైబీసీ25.హెచ్‌టీఎంఎల్'ను చూడాలని సూచించారు.

తిరుపతి- సికింద్రాబాద్ మధ్య నేడు, రేపు ప్రత్యేక ఏసీ రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని శుక్ర, శనివారాల్లో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ఏసీ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైలు (09497) తిరుపతిలో శుక్రవారం బయలుదేరి గూడూరు, తెనాలి, నడికుడి, నల్లగొండ మీదుగా మరుసటి రోజు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు (09498) సికింద్రాబాదులో బయలుదేరి బేగంపేట, వికారాబాదు, రాయచూర్, ఆదోని, గుంతకల్లు, కడప, మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలుకు పూర్తిగా 3 ఏసీ పెట్టెలు ఉంటాయి.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...





మోదీతో చంద్రబాబు, పవన్





నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)





సభలో ఉప్పొంగిన దేశభక్తి




శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో టీడీపీ మహిళా నేతలు







పొలాల వెంబడి పరుగులు

పారిశ్రామికంగా చిల్లకూరు అభివృద్ధి

- సుమారు రూ.4500 కోట్లతో పనులు
- రెండేళ్లలో అభివృద్ధి పనులు పూర్తి

చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం త్వరలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తద్వారా ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న సాగరమాల, క్రిస్‌సిటీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారులను కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ సుమారు రూ. 3వేల కోట్లతో సాగరమాల రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వరగలి క్రాస్‌రోడ్డు నుంచి 35 కిలోమీటర్లు, నాయుడుపేట నుంచి 36 కిలోమీటర్లు, ముత్తుకూరు నుంచి 19 కిలోమీటర్లు వరకు సాగరమాల రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల్లో భూసమస్యలు, మైనింగ్, ఇరిగేషన్ వంటి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నాయుడుపేట నుంచి కృష్ణపట్నంపోర్టు సౌత్‌గేట్ వరకు నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు పనులను 2027 జూన్ కల్లా పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ రోడ్లు కృష్ణపట్నపోర్టుకు అనుసంధానం చేయడం ద్వారా మండలంలో ఎక్కువశాతం పరిశ్రమలు రానున్నాయన్నారు. అదేవిధంగా తమ్మనపట్నంలో 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీ పారిశ్రామికవాడను ఏర్పాటు చేయనున్నామన్నారు. క్రిస్‌సిటీలో 1200 కోట్లు రూపాయల పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్లు అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది డిసెంబరు కల్లా క్రిస్‌సిటీలో రూ.1200 కోట్లు అభివృద్ధిపనులు పూర్తవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సాగర్‌మాల రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

టిప్పర్ ఢీకొని సర్వేయర్ దుర్మరణం



సర్వేయర్ సునీత (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని మండల సర్వేయర్ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... మండల సర్వేయర్ సునీత (35), సురుటుపల్లి సచివాలయ సర్వేయర్ దినేష్‌లు గురువారం సాయంత్రం సురుటుపల్లిలో ఓ స్థలాన్ని సర్వే చేశారు. అనంతరం దినేష్ ద్విచక్రవాహనంపై ఈమె నాగలాపురానికి బయలుదేరారు. బయటకొడియంబేడు వద్ద వెనుక వస్తున్న ఒక టిప్పర్ లారీ అధిగమించే క్రమంలో వీరి ద్విచక్ర వాహన స్టీరింగ్‌ను తాకింది. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దినేష్, సునీతలు చెరోవైపు పడిపోయారు. లారీ చక్రం ఈమె తల భాగం మీదుగా వెళ్లడంతో సునీత సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. దినేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని సత్యవేడు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడిని నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశులు టీటీడీలో ఏఈగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడికి డెంగ్యూ

రేణిగుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ సీఆర్‌నగర్ కాలనీలో ఈశ్వరయ్య అనే వృద్ధుడు డెంగ్యూ భారినపడ్డాడు. పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ చల్లి, నీటి ట్యాంకులను శుద్ధి చేశారు.

సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపును సద్వినియోగం చేసుకోండి



జీఎస్టీపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న జేటీసీ కృష్ణవేణి, టీడీపీ మురళీమోహన్ తదితరులు

- జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి

తిరుపతి(రవాణా), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి పిలుపునిచ్చారు. దీనిపై రవాణాశాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో వాహనాల కొనుగోలుపై జీఎస్టీ రేటు తగ్గింపుతో ప్రజలకు కలిగే ఆదాపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. కొనుగోలుదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా తిరుపతి రవాణాశాఖ కార్యాలయంలో వాహన డీలర్లతో స్టాళ్లను ఏర్పాటు చేశామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ చెప్పారు. ఆటోమొబైల్ రంగంలో నూతనంగా వచ్చిన వాహనాలను ప్రజలకు చూశారు. జీఎస్టీపై ఫిర్యాదు చేయదలుచుకుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1915కు సమాచారం ఇవ్వాలని జీఎస్టీ అధికారులు రాజ్యలక్ష్మి, నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, రమణనాయక్, ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత, పరిపాలన అధికారులు, విజయప్రశాంతి, విజయ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన దృశ్యం